క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ తోట, తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని 12వ వార్డు సూర్యాపేటలో శ్రీగంగమాంబ సుకీర్తి సమేత శ్రీబసవేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వేర్వేరుగా శంకుస్థాపన పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శిరంగి శ్రీనివాస్, యాండ్ర బుజ్జి, అముజూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాఖీలు కట్టిన ఓంశాంతి భక్తులు



గొల్లపాలెంలో రాఖీల కడుతున్న ఓంశాంతి భక్తులు

కాజులూరు: ఓంశాంతి భక్తులు నిర్వహించిన రాఖీ వేడుక ప్రత్యేకత సంతరించుకుంది. రక్షబంధన్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గొల్లపాలెం, మొగలిపాలెం, ఆర్యావటంలో ఓంశాంతి భక్తులు ఆదివారం ఇంటింటా పర్యటించి ప్రతి ఒక్కరికీ రాఖీలు కట్టారు. గొల్లపాలెంలో కాజులూరు ఓంశాంతి ఆశ్రమ నిర్వాహకురాలు బీకే రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహం

కాజులూరు: ఆర్యావటం శివారు తుమ్మలపల్లి లంకలో భక్తిశ్రద్ధలతో ఏకాహం కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి పుస్కరించుకుని ఏర్పాటు చేసిన ఏకాహం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం జ్యోతిప్రజ్వలన అనంతరం భక్తిగీతాలాపన ప్రారంభించిన బృందం సభ్యులు ఆదివారం ఉదయం వరకూ నిర్విరామంగా కొనసాగించారు. పరిసర గ్రామాలకు చెందిన పలువురు భజన బృందం సభ్యులు ఏకాహంలో పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు.

20న మండల సర్వసభ్య సమావేశం

కపిలేశ్వరపురం: ఈ నెల 20న కపిలేశ్వరపురం మండల పరిషత్ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆదివారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, భవిష్యత్తులో చేపట్టవలసిన పనులపై చర్చిస్తారన్నారు. మండల పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమావేశానికి హాజరవ్వాలని ఎంపీడీఓ ఆదేశించారు.

ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం

రంగంపేట: ద్విచక్రవాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో స్వాధీనం చేసుకున్న మూడు ద్విచక్ర వాహనాలను ఈనెల 21వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ప్రోటోకాల్ పాటించడం లేదు

కపిలేశ్వరపురం: టేకి గ్రామ కార్యదర్శి ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడంలేదంటూ ఆ గ్రామ ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై ఆదివారం ఆమె మండిపడ్డారు. గతంలో పలు సందర్భాల్లో ప్రభుత్వ శాఖల కార్యక్రమాల్లో సైతం అవమానించారన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కిట్లు అందజేసినప్పుడు, సహకార సంఘం కార్యక్రమాలకు ఆహ్వానించలేదన్నారు. ప్రజలు ఎన్నుకోన్న తనను ప్రభుత్వ అధికారులు గౌరవించడంతో పాటు గ్రామ పరిధిలో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానించడం విలువలతో కూడిన కార్యాచరణ అని ఎంపీటీసీ హితవు పలికారు.

బాలాజీ ఆలయానికి రూ.1.52 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి ఆదివారం రూ.1,52,763 ఆదాయం వచ్చింది. పవిత్ర శ్రావణమాసం ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

శివారు కాలనీల్లో సమస్యల తిష్ట

- మౌలిక వసతులు లేక ప్రజల ఇక్కట్లు
- పెరిగిన పట్టణ విస్తీర్ణం
- అభివృద్ధి ప్రణాళికలు కరవు



రామచంద్రపురం శీలంవారిసావరంలో అభివృద్ధికి నోచుకోని విజయలక్ష్మీనగర్ రోడ్డు

రామచంద్రపురం: భారీ వర్షాలకుతోడు మౌలిక వసతులు కల్పించకపోవడంతో రామచంద్రపురం పురపాలక పరిధిలోని శివారు ప్రాంతాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోక పోవటంతో ఆయా ప్రాంతాల ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. శివారు కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేక పోవటంతో విషసర్పాలు, పందుల సంచారం, దోమల విజృంభణ తదితర సమస్యలు తిష్టవేస్తున్నాయి. దీంతో బిక్కుబిక్కుమంటూ ప్రజలు కాలం వెల్లబుచ్చుతున్నారు.

పదేళ్లుగా పెరిగిన పట్టణ విస్తీర్ణం

విద్యా, వైద్యం తదితర రంగాల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో పురపాలక సంఘ పరిధి ఏటా విస్తరిస్తోంది. పట్టణానికి అనుకుని ఉన్న గ్రామాల వైపు కాలనీలు విస్తరిస్తున్నాయి. రోజుకో లేవుట్ చొప్పున పుట్టగొడుగుల్లా వస్తున్నాయి. మున్సిపాలిటీని అనుకుని ఉన్న గ్రామ, పట్టణ శివార్లు ఏకమవుతున్నాయి. పట్టణ పరిధి విస్తీర్ణం పెరుగుతున్నా దానికి అనుగుణంగా అభివృద్ధి లేక విస్తరించిన ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పట్టణ విస్తీర్ణం 13.2 చదరపు కిలోమీటర్లు ఉండేది. పదేళ్లుగా పట్టణ విస్తీర్ణం విపరీతంగా పెరిగింది. పట్టణ శివారు ప్రాంతాలైన అఫీషియల్ కాలనీ, ముచ్చిమిల్లి, వీఎస్ఎం కళాశాల ప్రాంతం పసలపూడి రోడ్డు, బైపాస్ రోడ్డు, ద్రాక్షారామ రోడ్డు శీలంవారి సావరం-యనమదల, వెల్ల రోడ్డు, తోటవారివీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో కొత్తగా లే అవుట్లు అభివృద్ధి చేశారు. చాలా ఏళ్ల క్రితమే కాలనీలుగా ఏర్పడ్డ అఫిషియల్ కాలనీ శివారు ప్రాంతం, శ్రీరామ్‌నగర్, శీలంవారిసావరంలో రోడ్డులో గల విజయలక్ష్మి నగర్ ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం జోరుగా సాగి నూతన కాలనీలు ఏర్పడ్డాయి. ఇటీవల కాలంలో వీఎస్ఎం కళాశాల ఎదురుగా, బైపాస్ రోడ్డులో లేవుట్ పెరిగి గృహనిర్మాణాలు జోరందుకున్నాయి. తదనుగుణంగా సౌకర్యాలు మాత్రం పెరగటంలేదు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు ఆయా కాలనీల్లోకి రాకపోవటంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

మౌలిక సదుపాయాల కొరత

ప్రస్తుతం పట్టణం మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి 27 వార్డులుగానే ఉంది. విస్తీర్ణం పెరుగుతున్నా వాటి స్వభావం మాత్రం అలాగే ఉంది. దీనికి తోడు ఇటీవల ఒకటో వార్డులోని 34 ఎకరాల్లో అందరికీ గృహ నిర్మాణం పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో మున్సిపాలిటీ విస్తీర్ణం మరింతగా పెరిగింది. వార్డుల విస్తీర్ణం, కాలనీలు పెరగడంతో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మున్సిపాలిటీకి భారంగా మారింది.

17,500 కుటుంబాలు నివాసం

పెరుగుతున్న కాలనీలకు తగ్గట్టుగా మున్సిపల్ సిబ్బందిని పెంచాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మునిసిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల కొరత కారణంగా పారిశుధ్య నిర్వహణ భారంగా మారుతోంది. ఆయా వార్డులతో పాటు శివారు ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు అంతంతమాత్రంగానే కనిపిస్తున్నాయి. శివారు కాలనీలకు వీధిలైట్లు, డ్రెయినేజీలు, రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కరువయ్యాయి. పట్టణంలో సుమారుగా 48,650 జనాభా ఉండగా, 17,500 కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు అధికారిక లెక్కలున్నాయి. పట్టణ విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో కాలనీలు, కుటుంబాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. పట్టణ జనాభానే కాకుండా ప్రతి రోజు సుమారుగా లక్ష మందికి పైగా పట్టణానికి వచ్చి వెళుతుంటారు. దీనికి తగ్గట్టుగా అన్ని రకరాల సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. దీని కోసం మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ తోటను కలిసిన చైర్‌పర్సన్ దుర్గారాణి



ఎమ్మెల్సీ తోటకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సోమవారం మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో ఎమ్మెల్సీ తోటకు చైర్‌పర్సన్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణ పరిధిలోని పాలన పరిస్థితులు, రాజకీయ అంశాలపై ఇరువురు కొంతసేపు చర్చించారు.

వాకింగ్ ట్రాక్ ప్రారంభం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట రూరల్ మండలం ఏడిదలో గ్రామానికి చెందిన దాత, పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తమరావు, అనంతలక్ష్మి కుమారి దంపతులు సౌజన్యంతో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. ఈ మేరకు నేడు సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతులు మీదుగా వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తారని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

గోదావరి ఉగ్రరూపం



కపిలేశ్వరపురంలోని పుష్కర ఘాట్‌ను తాకిన వరదనీరు

కపిలేశ్వరపురం: ఇటీవల గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గౌతమి గోదావరి నది ఉప్పొంగుతుంది. అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరగడంతో కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాల్లోని పుష్కర ఘాట్ మెట్లు నీట మునిగాయి. వరద తీవ్రత మరింత పెరిగితే అద్దంకివారిలంక, పల్లపులంక, నారాయణలంక, కేదారిలంక, వీధివారిలంక వ్యవసాయ క్షేత్రాలను వరదనీరు ముంచెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

వదలని వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

కె.గంగవరం: అల్పపీనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రెండు రోజులుగా ఎడతెరుపు లేకుండా మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి చినుకుచినుకుగా కురిసిన వర్షం సాయంత్రానికి జోరందుకుంది. వర్షం ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లోని పల్లపుప్రాంతాలు నీటి మునిగాయి. కె.గంగవరం మండలంలోని ప్రధాన కాలువలు వర్షపునీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన కాలువలు, చెరువులు నిండాయి. యండగండిలోని టేకి డ్రెయిన్‌లో భారీగా గుర్రపుడెక్క కొట్టుకురావడంతో వర్షపు నీరు ముందుకు కదలడం లేదు. పొలాల నుంచి డ్రెయిన్‌కు వస్తున్న వర్షపు నీరు వెళ్లేందుకు గుర్రపుడెక్క అడ్డుపడుతోంది. ఈ గుర్రపుడెక్కను తొలగించకపోతే పొలాల్లోని వర్షపు నీరు బయటకి వెళ్లే దారి లేక ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న పామర్రు రాజు కాలువ

కాజులూరులో భారీ వర్షం

కాజులూరు: బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఆవర్తన ద్రోణి, తుఫాన్ ప్రభావంతో ఆదివారం కాజులూరు మండల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం వరకూ ఏకధాటిగా కురవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, వీధుల్లో వర్షపు నీరుచేరి జలమయమయ్యాయి. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలోనూ తరచూ అంతరాయం ఏర్పడింది.



ఊడిమూడిలో ప్రధాన రహదారిపై వర్షం నీరు



గొల్లపాలెంలో జలమయమైన కాకినాడ- కోటిపల్లి రహదారి

అమ్మ టీమ్ లోగో ఆవిష్కరణ

రామచంద్రపురం రూరల్: సమాజంలో ఆకలితో ఎవ్వరూ ఉండకూడదన్న ఆశయంతో పదేళ్లుగా కె.గంగవరం మండలం కేంద్రంగా సేవా, సహాయ కార్యక్రమాలు చేపడుతున్న అమ్మ టీమ్ సభ్యులు తమ సంస్థ లోగోను ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సలాది ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సమాజంలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న ఆశయంతో ఫంక్షన్లలో మిగిలిన ఆహార పదార్థాలను తమ సంస్థ సభ్యుల ద్వారా సేకరించి ఆకలితో ఉన్న వారికి అందజేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ యువ మోర్చా కె.గంగవరం మండల అధ్యక్షుడు పి.శ్రీరామ్ వారిని అభినందించారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో సంస్థ లోగోతో అమ్మ టీమ్ సభ్యులు

నేత్రపర్వంగా సత్యదేవుని కల్యాణం

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠం 53వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నవరం శ్రీవీర వెంకటసత్యనారాయణ స్వామి దేవస్థానం వారిచే పీఠంలో ఉన్న శ్రీలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి వారి దివ్య కల్యాణం నేత్రపర్వంగా సాగింది. పీఠంలో ఈ నెల 16 శనివారం నుంచి వార్షికోత్సవాలు ప్రారంభమైన విషయం పాఠకులకు విదితమే. విజయదుర్గా పీఠంలో శ్రీలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి దివ్య కళ్యాణం నేత్ర పర్వంగా సాగింది. అన్నవరం దేవస్థానం అర్చకుల నేతృత్వంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. వినాయక పూజ, కలశ స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, పంచలోక పాలకులు, ఆదిత్యాది నవగ్రహ, అష్టదిక్పాలకులకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కోట అసోసియేట్స్ అధినేత కోట సునీల్‌కుమార్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి మాజీ రీజనల్ కోఆర్డినేటర్ కందర్ప హనుమాన్, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు పూజల్లో పాల్గొన్నారు.



పీఠంలో లక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి దివ్య కల్యాణానికి హాజరైన భక్తులు

ఆది గణపతి ఆలయానికి భక్తుల తాకిడి



విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: ఆది గణపతి అయినవిల్లి విఘ్నేశ్వరాలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారు జామున మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ నిర్వహించారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి సన్నిధిలో చిన్నారులకు అక్షరభ్యాసం, తులాభారం, అన్నప్రాసన కార్యక్రమాలు, వాహన పూజలు నిర్వహించారు. 2,400 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

కొబ్బరి డొక్కలతో ప్రకృతి ఎరువు

మలికిపురం: కొబ్బరి డొక్కలకు నిప్పు పెట్టాల్సిన అవసరం లేదని, కొబ్బరి తోటల్లో చెట్ల మధ్య గాడులు తవ్వి డొక్కలతో పూడ్చివేస్తే అవి కుళ్లిపోయి తోటలకు బలాన్నిస్తాయని కొబ్బరి బోర్డు మాజీ సభ్యుడు ముదునూరి సీతారామ సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. పి.గన్నవరం, మామిడికుదురు మండలంలో కొందరు రైతులు డొక్కలు కొనే వారు లేక తగలబెడుతున్నట్లు సాక్షిలో ఆదివారం వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. కొబ్బరి తోటల్లోనే ఒలుపు చేయించి మిగిలిన డొక్కలను చెట్లకు ఎరువుగా వాడవచ్చునని ఆయన సూచించారు. కొబ్బరి డొక్క, ఆకులను కుళ్లబెట్టి కొబ్బరి తోటలకే ఎరువుగా వాడడం వల్ల భూసారం పెరగడంతో పాటు మెరక అవుతుందన్నారు.

విఖనస స్వామికి తులసి దళార్చన

ఆలమూరు: స్థానిక శ్రీదేవిభూదేవి సమేత జనార్దన స్వామి ఆలయంలో ఆదివారం విఖనస స్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆలయ ఆవరణలోని విగ్రహం వద్ద మండలం వైఖానస సంఘం ఆధ్వర్యంలో వేద పండితులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేష తులసి దళార్చన నిర్వహించారు. అంగర సత్యనారాయణాచార్యులు, అంగర గోపాలాచార్యులు, భగవాన్, సింగ్‌బాబు, గోపి, ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల జ్ఞాపకాలు



చెల్లూరులో కలిసిన 1988-96 బ్యాచ్ విద్యార్థులు

రాయవరం: విద్యార్థి దశలో చేసిన అల్లర్లు..ఆటలు, పాటలు, ఉపాధ్యాయులు చెప్పిన మంచి మాటల ఫలితంగా ప్రస్తుత స్థాయికి చేరుకున్న వైనాన్ని అలనాటి పూర్వ విద్యార్థులు ఒకచోటుకి చేరి నెమరవేసుకున్నారు. రాయవరం మండలం చెల్లూరు శ్రీ సర్వారాయ షుగర్స్ చిల్డ్రన్ ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు వేదికగా నిలిచింది. 1988–96 బ్యాచ్‌కు చెందిన 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుకుని విడిపోయిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. దేశ, విదేశాల నుంచి దూరాభారాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చిన తమ చిన్ననాటి స్నేహితులను వేదికపై తమ కుటుంబ సభ్యులకు, గురువులకు తమను తాము పరిచయం చేసుకుని ఉద్వేగానికి లోనయ్యారు. మొత్తం 43 మంది విద్యార్థులకు 36 మంది కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. తమ ఉన్నతికి కారకులైన గురువులను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సన్మానించారు. విద్యార్థి దశలో తెలిసీ తెలియక చేసిన ఆకతాయి తప్పులకు, అలనాడు గురువులు చేసిన దండనలను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయులు జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

సంతృప్తితో వెళ్తున్నా..



ప్రస్తుతం కువైట్ ఆయిల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. పూర్వ విద్యార్థులు, నాటి గురువులను కలుసుకోవాలన్న పట్టుదలతో మిత్రుల సహకారంతో అందరినీ ఒకే వేదికపైకి చేర్చాం. ఇందుకు చాలా కష్టపడ్డాను. చిన్ననాటి మిత్రులను కలుసుకోవాలనే కోరికతో దూరాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చాను. ఇప్పుడు మరోసారి జ్ఞాపకాలను మూటగట్టుకుని సంతోషంతో తిరిగి వెళ్తున్నా.

– తీపర్తి నరేష్‌కుమార్, పూర్వ విద్యార్థి, కువైట్

మాటల్లో వర్ణించలేను



ప్రస్తుతం నేను భర్తతో కలిసి ముంబైలో ఉంటున్నా. చిన్ననాటి స్నేహితులను, విద్యాబుద్ధులను నేర్పిన గురువులను కలుసుకునేందుకు అక్కడి నుంచి వచ్చాను. అందరినీ కలుసుకున్న ఆనందం మాటల్లో వర్ణించలేను.

– పిల్లి సుబ్బలక్ష్మి, పూర్వ విద్యార్థిని, ముంబై

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాఠశాల ఆవరణలో చదువు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

కె.గంగవరం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు కె.గంగవరం ఉన్నత పాఠశాల వేదికైంది. 2005–06 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకుని బాల్య స్నేహితులతో ఆప్యాయతానురాగాలు పంచుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు. తమ కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థుల ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. తొలుత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలదండలు సత్కరించ, జ్ఞాపికలు అందజేశారు. సుమారు 280 సంవత్సరాల తరువాత వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్నేహితులందరూ ఒకేచోట కలుసుకుని ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులందరూ కలసి సహపక్తి భోజనాలు చేసి బాల్యంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషం వ్యక్తం చేశారు. వీలైనంత వరకు ఏటా కలుసుకునేందుకు ప్రయత్నిస్తామని తమకు విద్యా బోధన నేర్పిన పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని వారు పేర్కొన్నారు.